సంఘర్షణ

గిరిసింహం

"కమాన్ మిష్టర్! మాకన్నీ తెలుసు. నీవేందాచీ లాభంలేదు. అనవసరంగా ఒళ్ళు పాడుచేసుకోకు. చెప్పేయ్- ఊఁ- ఆలస్యంపనికిరాదు". కళ్ళల్లో నిప్పుకణికలు ఎగజిమ్ముతూ గదంతా ప్రతిధ్వనించేలా హూంకరించాడు యస్.ఐ సీతారామయ్య

చిరిగిన ధోతీ, మాసిన చొక్కాలతో, ఎన్నాళ్ళో కూడూ నీళ్ళూ లేకుండా కృషించిన శరీరంతో చలిజ్వరంవచ్చిన రోగిలా వణుకుతున్నాడా యువకుడు. ఒళ్ళంతా పచ్చిపుండై పోయింది. ఎముకలు తీపులుపెడ్తున్నాయి. నరకమనేది ఉంటే గింటే అది ఇక్కడేనేమో అనే ఆలోచన తళుక్కుమంటూ ఉంది. సీతారామయ్య చేతిలోని లాఠీ యమదండలాగే ఉన్నది. దీనంగా మూల్గాడు. ఏదో చెప్పాలని పెదవులు విచ్చుకున్నాయి. తన ప్రయత్నం సఫలంకాకముందే మనస్సు అవమాన భారంతో కుంగి, విచ్చిన పెదవుల్ని తిరిగి మూసివేసింది.

"కమాన్! నాకు తిక్కరేపకు: పిచ్చిపిచ్చి వేషాలువేయక, నిజం చెప్పేయ్, మాకన్నీ తెలుసు. ఏందాచినా లాభంలేదు. కోపమొస్తే మనిషినిగానని తెల్సుగా. నీకు వచ్చిన భయమేమీలేదు: రాజాలాంటి ఉద్యోగమిప్పిస్తాను. చదువుకొన్నవాడివి హాయిగా ఉద్యోగంచేసుకుంటూ, పెండ్లి చేసుకొని కులాసాగా గడపకుండా ఈ వెర్రిమొర్రి వుద్యమాలు నీకెందుకయ్యా! కమాన్! నీవెంబడి ఎల్లాపురం మామిడితోపుల్లో మీటింగుకొచ్చిందెవరు?".

"నాకు తెలియదు" దీనంగా నూతిలోంచి వచ్చినట్లు వణుకుతూ ఉన్నదాగొంతు.

"యూ డర్టీ ఫెలో! బద్మాష్ లంజాకొడుకా! నీవిట్లా మంచిగా మాట్లాడితే చెప్తావురా! యూహార్డెండ్ క్రిమినల్!"

టప టపమంటూ వడగళ్ళ జల్లులాపడ్తున్నాయి లాఠీదెబ్బలు. అబ్బా!...ఎముకలు విరిగిపోతున్నాయి. ప్రాణాలు ఎగిరిపోతున్నట్లయి అనంతమైన పీడన, మెల్లగా కళ్ళు మూతలుపడసాగాయి. ప్రపంచమంతా గిరగిర తిరుగుతున్నట్లనిపిస్తూంది రాజుకు. బలంగాపడింది సరిగ్గా ముఖమ్మీదనే ఒక లాఠీదెబ్బ. ఉడుకురక్తం వేగంగా చిమ్మింది. విరిగిన పంటినుండి, అబ్బాఅనే కేకతో స్పృహతప్పి పడిపోయాడు.

తిరిగి కళ్ళు తెరిచేసరికి ఎదురుగా నెరసినగడ్డం, ముడుతలుపడ్డ మోముతో మొహంపై నీళ్ళుచల్లుతూ కనిపిస్తున్నాడు రైతరు అప్పయ్య. సావిట్లో కుక్కినుకట్టేసి

నట్లు స్తంభానికి సంకెళ్ళతో బంధించి పడుకోబెట్టారు తనను, ఏదో మాట్లాడుదామని నోరు తెరిచాడు. ఐతే అసహ్యమైన వేదన- ఒక్కసారిగా నరాలన్నీ గుంజుకుపో యాయి- దీనంగా మూల్గడంతప్ప ఇంకేమీ చేయలేకపోయాడు. భీతావహమైన చూపు లతో అటూ ఇటూ చూడసాగాడు.

లేని సానుభూతిని తెచ్చిపెట్టుకుంటూ అప్పయ్య ఉపన్యాసం దంచేస్తున్నాడు. వచ్చీరాని ఇంగ్లీషు అక్కడక్కడా కలుపుతూ.

"మిష్టర్ రాజూ! యూ ఎడ్యుకేట్ మాన్! వైడు లైక్ దట్. నీకేం తక్కువయిం దని ఇటువంటి ఉద్యమాల్లో దిగావయ్యా? అయినా వీటివల్ల ప్రజలకేంలాభం చెప్పు. ఎక్కడో నలుగురు దళంఅని జమకూడితిరి. ఎవడ్నో ఒకడ్ని పుటుక్కుమనిపిస్తిరి. మీరొక్క భూస్వామిని చంపితే ప్రభుత్వం వూర్కొంటుందా? ఊళ్ళోని జనాన్నంతా వీపులుపగల బాదిస్తుందాయె. ఆ దెబ్బలకాసక వాళ్ళు మళ్ళా మీరుపోతే మిమ్మల్నే పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఏం కాదంటావా? మల్లారెడ్డిగూడెంలో మీ ఎల్లయ్యే ఎట్లా పట్టుబడ్డాడు చెప్పు? అన్నీ పిచ్చిచేష్టలుకాకపోతే ఇవన్నీ ఏందయ్యా?

ఆఁ- కొట్లాడు; నేనొద్దనను. కొట్లాడకపోతే ఈ బలిసిన లంజకొడుకులు పెచ్చురేగిపోతారు. ఐతే దానికీ ఒక పద్ధతివున్నది. ఇప్పుడు మనది ప్రజాప్రభుత్వ మాయె. మీటింగులుపెట్టు. వూరేగింపులుతీయి, సంఘాలుపెట్టు, పబ్లిగ్గా కొట్లాడా లోయ్! అదీ ధైర్యమంటే. ఈ చాటుమాటు వ్యవహారాలేందయ్యా. చూడు, మన పుల్లయ్యగారు వున్నారు. ఆయనమాత్రం కమ్యూనిస్టుకాడూ? మొన్న హుజూరాబాద్‌లో పెద్ద ఊరేగింపుకూడ తీసిండు. అటువంటివాళ్ళను మేమేమైనా అంటామ్మా?

II

ఐనా వృద్ధిలోకి రావల్సిన యువకుడివి నీకెందుకోయ్. ఈ తతంగాలు; చూడు అనవసరంగా బ్రతుకు పాడుచేసుకోకు. మా ఎస్.ఐ. మంచివాడుగాని లేకుంటే ఏనాడో నిన్ను టపీమన్పించేసును ఇప్పుడైనాగాని నిన్ను ఎల్లమ్మగుట్టకు తీసికెళ్ళి కాల్చేస్తే దిక్కెవరయ్యా? మీ వెంపటాపు సత్యం, కైలాసంలగూర్చే అడిగేవాడు లేకపోతే నీ సంగతెవరు పట్టించుకుంటారోయ్? అనవసరంగా ఆరోగ్యం పాడుచేసుకోకు. ఇప్పుడు నీకు తగిలినదెబ్బలు ఆవగింజంతకాదనుకో. మా ఎస్.ఐ. గార్కి తిక్కరేగిందంటే కట్టెపుల్లను విరిచినట్లు విరిచిపారేస్తాడు. వింటున్నావా?- దిగాలుపడి చూస్తావేమయ్యా? ఆకలిగాఉందా? కొద్దిగా టీ తాగుతావా? ఆఁ—ఏమైనా టిఫిన్‌తింటావా?" అని ఒరేయ్ రాజయ్యా! ప్లేట్‌పూరీ, ఒక టీ పంపించు" అంటూ కానిస్టేబుల్ రాజయ్యను గదిమాడు.

489

బాధతో మెలికలు తిరుగుతూ కళ్ళుమూస్తూ తెరుస్తూ వినలేక వింటున్నాడు రాజు. ఇంతలో టిఫిన్, చాయ్‌తో హోటల్‌పిల్లవాడు హాజరయ్యాడు.

ఎంతో ప్రేమ ఉట్టిపడుతున్నట్లు మెల్లగా రాజునులేపి పూరీప్లేట్ అందించాడు రైటరు అప్పయ్య. చచ్చిన ఆకలి ఒక్కసారి లేచిరాగా అమాంతం ప్లేటునే మింగేసినంత పనిచేశాడు రాజు. తర్వాత వేడి టీ కడుపులోకి పోయినంక కొద్దిగా ప్రాణం వచ్చినట్లయింది. కాస్త సర్దుకుని గోడకానుకొని కూర్చున్నాడు.

అప్పయ్య సిగరెట్ వెలిగించాడు. ఇంకోసిగరెట్ రాజుకిచ్చి "హావ్ ఇట్" అంటూ అగ్గిపుల్ల వెలిగించి అంటిపెట్టాడు. మౌనంగా సిగరెట్ కాలుస్తున్నాడు రాజు.

"పోనీ నాకు చెప్పవయ్యా దేవునిమీద ఒట్టు. నేనెవ్వరికీచెప్పను. ఊరికే తెల్సుకోవాలని అడుగుతున్నాను. ఎల్లాపురం తోపుల్లో మీటింగుకొచ్చిందెవరు? అబ్బీ! నీవు చెప్పకపోయినా పర్వాలేదు. ఊరికే ఏదో కుతూహలంకొద్దీ అడుగుతున్నానులే. ఐనా నాకుచెప్తే నష్టమేమయ్యా?" ఊరిస్తున్నాడు అప్పయ్య.

అంత బాధలోనూ నవ్వొచ్చింది రాజుకు. చిరునవ్వుతో "నాకు తెలియదు" అన్నాడు.

"పోనీ నీకేంతెల్సో చెప్పవయ్యా. మీ వెంకటాద్రిమయ్య ఎక్కడుంటాడు? ఒక్క అడ్రెసుచెప్పు చాలు. నిన్ను వెంటనే విడిచిపెట్టే ఏర్పాటుచేస్తాను, చెప్పు. తరచి, తరచి అడుగుతున్నాడు.

"నాకు తెలియదు. అసలా వెంకటాద్రిమయ్య ఎవడో నాకు తెలియదని ముందే చెప్పానుగా".

"మళ్ళీవరస మామూలే. ఇదిగో రాజూ, డిస్ నాట్ గుడ్, ఇదేం మంచిది కాదయ్యా" అయినా నీఖర్మ, చేజేతులా జీవితాన్ని పాడుచేసుకొంటున్నావు సర్లే తీరిగ్గా ఆలోచించుకో. రేపు హైదాద్రిబాదునుండి ఎస్ బి. వాళ్ళువస్తారు. వాళ్ళముందు బ్రహ్మదేవుడుకూడ ఏమీచెయలేడోయ్. మర్యాదగా అడిగిందానికంతా టక టకమని జవాబులిచ్చేయ్. రేపుకూడ ఇదేవరసైతే నీ ఒళ్ళు చితగ్గొట్టేస్తాడు. మా ఎస్ ఐ. అంతేకాదు. నీ ప్రాణాలమీద ఆశకూడ వదులుకోవాల్సిఉంటుంది. ఇకవస్తా. ఇంట్లో మా ఆవిడ కాస్త ఆలస్యమైతే ఎగిరిపడుతుంది. సంసారం, సాగరంమరి. ఐనా బుద్ధిగా ఆలోచించుకో, ఈ వెర్రిమొర్రి వేషాలు మానెయ్ నీతండ్రిలాంటివాడ్ని. నేనుచెప్పిందివిను. నిన్ను అందలమెక్కించేట్లు చేస్తాను". అంటూ నిష్క్రమించాడు అప్పయ్య.

సూర్యుడెప్పుడో అస్తమించాడు. చీకటిపొడలాగా అనంతాకాశాన్ని ఆవరిస్తూంది. పోలీస్‌స్టేషన్‌లో కలకలం తగ్గింది. నిశ్శబ్దం ఆవహించింది. ఒకరొకరుగా జవాన్లు

ఇండ్లకు వెడుతున్నారు. రైఫిల్ చేతపట్టుకొని రాజుముందే నిలబడి ఒక పోలీసుకాపలా కాస్తున్నాడు.

చలిగాలి రివ్వున వీచసాగింది. పుండులో కారంపోసినట్లు దేహమంతా మండ సాగింది రాజుకు. బాధగా మూల్గుతూ అటూ, ఇటూ పొర్లుతూ ఉన్నాడు రాజు నిద్రి పట్టడంలేదు. ఎట్లాపట్టుంది? మనసే ఒక యుద్ధరంగమైపోయింది. ఆలోచనలు ప్రవాహాల్లా వచ్చిపడ్తున్నాయి, ఆలోచనలు— పరస్పరం సంఘర్షించే భావాలు... ... ... "చదువుకొన్నవాడివి. హాయిగా ఉద్యోగంచేసుకుంటూ, పెండ్లిచేసుకొని ఖులాసాగా గడపకుండా......" ఎస్.ఐ. సీతారామయ్య గుడ్లు మిటకరిస్తూ తొంగిచూస్తున్నాడు. రాజు మనోపథంలో.

"అనవసరంగా ఒళ్లు పాడుచేసుకోకు" భూతంలా హూంకరిస్తున్నాడు సీతారామయ్య. అసహనంతో అటూ, ఇటూ కదిలాడు. ఎముకలు టపటపటమన్నాయి. జివ్వుమన్నది. ప్రాణాలు లేచిపోయాయి.

"చెప్పేస్తే? చెప్పేస్తేఏం? ఏదో కొద్దిగా చెబుతాం. పార్టీకి నష్టంలేని విషయాలు చెబుదాం. పోలీసులకు తెలిసినంతమట్టుకూ చెప్పి మిగతావి దాచేద్దాం" బలంగా ఒక ఆలోచనా ప్రవాహం.

"అది చాలా తప్పుడు ఆలోచన. ఒక్కసారి చెప్పడమంటూ మొదలుపెడ్తే, ఆ ప్రవాహం అంతటితో ఆగదు. కామ్రేడ్! మనం సర్వం త్యాగంచేసి ఈ విప్లవపోరాటంలో దూకాం. పెనుతుఫానులొచ్చినా చలించకూడదు. పోలీసులకు మనం ఏ విషయమూ చెప్పవల్సిన అవసరంలేదు ఈ విషయమై జూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు' చదవండి" గంభీరంగా ప్రతిధ్వనించింది వెంకటాద్రియ్యగారి కంఠం. సిగ్గుతో చచ్చిపోయాడు రాజు తానేనా ఇలా ఆలోచిస్తున్నది? తనలో ఇంత బలహీనతా? ఒకసారి తానే ఎల్లయ్య ప్రతినిధులతో అన్నమాటలు గుర్తుకొచ్చాయి. "కామ్రేడ్! పెనుతుఫానులను ఎదుర్కొనగలవాడే కమ్యూనిస్టు అవుతాడు. వేలాదివీరులు తమ ప్రాణాల్ని పణంగా ఒడ్డి పోరాటంలో అమరులయ్యారు. వారి నెత్తుటిధారలతో గట్టిపడ్డ విప్లవ మార్గాన్నే మనం పయనించాలి."

ఉహుఁ— ఎన్నటికీ అలాకాదు. తాను పిరికివాడుకాకూడదు. అసలిలాంటి ఆలోచనలెందుకువస్తున్నాయి?

"రేపుకూడ ఇదేవరసైతే నీ ఒళ్ళు చితగ్గొట్టేస్తాడు మా ఎస్.ఐ. అంతేకాదు, నీ ప్రాణాలపై ఆశకూడ వదులోక్కోవాల్సివుంటుంది." మెత్తగా బెదిరిస్తున్నాడు అప్పయ్య.

ఉలిక్కిపడ్డాడు రాజు. జీవితం ప్రియమైన జీవితం— రేపటితో అంతమా? అనుకొన్నదేదీ సాధించకుండానే, తృప్తి అనేది దొరకకుండానే చావు—.

భయంకర మృత్యురాక్షసి— వికటాట్టహాసాలుచేస్తూ రాజును కౌగిలించుకోబోతోంది.

"అమ్మా!" చిన్న కేకతో ఎగిరిపడికూర్చున్నాడు. ఆవేదన మంటలాకాల్చేస్తోంది. అమ్మ, అక్క, నాన్న— ప్రియమైన నాన్నగారు— అందరూ కళ్ళముందు కదలాడసాగారు. ఇంతేనా? రేపటితో జీవితం అంతమేనా? కన్నవారికి దూరంగా, మిత్రులకు దూరంగా అభాగ్యుడిలా మృతిచెందాల్సిందేనా?

"పోనీ, ఏదోకొద్దిగా చెప్పేస్తే కొద్దిరోజులు బ్రతికి ఉండేందుకైనా కనీసం అమ్మనూ, నాన్ననూ, చూచుకొనేవరకైనా" ఆలోచన వెర్రితలలు వేస్తూంది.

"చావు అనేది ప్రతి మానవుడికీ తప్పనిసరి. ఐతే ప్రజలకోసం మరణించడం హిమాలయపర్వతంకంటె గంభీరమైనదికాగా భూస్వాములకు, దోపిడీదారులకు సేవలు చేసే ప్రజా శత్రువుల మరణం ఈకకంటే తేలికైంది." చైర్మన్ మావో మెల్లగా మందలిస్తున్నాడు.

మొహం దించుకుపోయింది రాజుకు. బ్రతుకుపై ఆశతో ఎంత నైచ్యపు ఆలోచనలు వస్తున్నాయి? ఐనా చావు తప్పనిసరి అయినప్పుడు చావంటే భయంఎందుకు? భయపడి లాభంమాత్రం ఏమిటి?

తానేనా? ఒకప్పుడు "మృత్యువును ధిక్కరించే సాహసం అలవర్చుకోవాలి" అని శ్రీరంగనీతులు చెప్పింది?

అసలీ ఆలోచనలు తనకెందుకువస్తున్నాయి? తానింత బలహీనుడా? ప్రజలకు సేవ సేయాలనే దీక్షతోగదా తానీ పోరాటంలోకి దూకింది. మరి అప్పుడు తనకీ కష్టాలు నష్టాలుంటాయని తెలియదా? మరీ రివిజనిస్టు ఆలోచనల్ని ఎలా అనుమతిస్తున్నాడు తాను?

"నిర్బంధానికి భయపడి రివిజనిస్టులంకాము" అమర పాణిగ్రాహి గానం అనంతాన్ని నింపివేస్తూ వినిపించసాగింది.

కాదు కాదు రాజు ఎన్నటికీ రివిజనిస్టుకాడు. తన పార్టీకి, ప్రజలకు ద్రోహం చేయలేదు.

"వేలాది, లక్షలాదివీరులు తమ ప్రాణాల్ని అర్పించి పోరాటాన్ని వృద్ధిచేసారు. వారి రక్తంతో ఎరుపెక్కిన ఎర్రజెండాను మరింత పదిలంగా నిల్పుకోవాలి".

492

చైర్మన్ మావో ఉద్బోధిస్తున్నాడు. ఔను తానూ ఆ వీరుల సంప్రదాయాన్ని నిలబెట్టాడు. తప్పదు. రాజు ద్రోహికాలేదు. పిరికివాడు కాలేదు. రాజు విప్లవకారుడు. ప్రజాసేవకుడు. పెనుతుఫానులకు, పెనుమంటలకూ చలించక నిలిచేవాడే కమ్యూనిస్టు. రాజు కమ్యూనిస్టు అవుతాడుకాని, ఇంకోవిధంగా అవలేదు. అవకూడదు.

మథనపడుతున్న మనస్సు కుదుటపడ్డది. సంఘర్షించే ఆలోచనా ప్రవాహాలు ఒక కొత్తభావాన్ని పుట్టించాయి. దృఢనిశ్చయంతో పిడికిలి బిగిసింది. అప్రయత్నంగా నోటిలోంచి,

"కష్టాలు, నష్టాలు ఓర్చుకొని వుంటాము
ఎందాకా రమ్మన్నా అందాకావస్తాము"
"యమయాతనలు పడియైనా సుఖమనుభవించాలి
మనకున్నా లేకున్నా మనముందుతరమైనానూ
ఎందాకానేస్తం అందాకావస్తాము
ఎందాకారమ్మన్నా అందాకా వస్తాము

అంటూ కూనిరాగం వెలువడింది. ఒక అనిర్వచనీయానందం శరీరాన్ని పులకితం చేసింది. రివ్వునవీచే చల్లగాలి జోలపాటపాడగా కుదుటపడ్డ మనసుని దరినాహ్వానించింది.

వ్యాసం

అమరకవి. సుబ్బారావు పాణిగ్రాహి

భూషణం

పాణిగ్రాహి అనగానే గిరిజన విప్లవపోరాటం గుర్తుకువస్తుంది. వెంపటాపు సత్యం మాట: పాణిగ్రాహిపాట గిరిజనులు విప్లవించడానికి తోడ్పడ్డాయి.

సహజంగా ఆయుధధారులైన గిరిజనులు అరణ్యప్రాంతంలో క్రూరమృగాల బారినుండి రక్షించుకొనేందుకు తమ తమ ఆయుధాలను ఉపయోగించేవారు. అమాయకులూ కష్టజీవులూ అయినవారిని దళారులూ, భూస్వాములూ దోచుకుంటూ తమ బొజ్జల్నీ, గాదెల్నీ నింపుకుంటుండేవారు.

కమ్యూనిస్టుపార్టీ వారి దృష్టిని తమ జీవితంపైపునకు మళ్ళించింది.

493